క్లుప్తంగా

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రత్యేకాధికారి, సచివాలయ సిబ్బంది

సారవకోట: మండలంలోని అంగూరు సచివాలయంలో వడ్డే ఓబన్న జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మండల ప్రత్యేకాధికారి ఎం.లోకనాథం ఆధ్వర్యంలో శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వతంత్ర్య పోరాటంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యానికి వడ్డే ఓబన్న సైన్యాధ్యక్షుడిగా వ్యవహరించి చేసిన భీకర పోరాటం గూర్చి ఈ సందర్భంగా వివరించారు. సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

తమ్మినేని సీతారాంను కలిసిన 'కోట'



తమ్మినేని సీతారాంతో కోట గోవిందరావు

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆయన నివాసంలో పార్టీ అధికార ప్రతినిధి కోట గోవిందరావు శనివారం కలిశారు. ఆమదాలవలస మండలం తమ్మయ్యపేటకు చెందిన గోవిందరావుకు పార్టీ పదవి దక్కింది. తమ్మినేనికి గోవిందరావు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని గోవిందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు ఇప్పిలి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాల ప్రారంభం



మినీగోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి: మండలంలోని శేఖరాపురం గ్రామంలో తాడేల యశోదమ్మతోపాటు మరో ముగ్గురు రైతులకు చెందిన మినీ గోకులాల షెడ్లను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం ప్రారంభించారు. 90 శాతం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ నిధులు, 10 శాతం రైతు వాటాతో నిర్మాణం చేపట్టిన షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నంబాళ్ల వెంకటరావు, అనపాన రాజశేఖర్ రెడ్డి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల అందజేత



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: మండంలోని చిన్నజొన్నవలసలో రోడ్డు, చెరువు ఆక్రమణకు గురయ్యాయని ఈ నెల 5న పేదల ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేసిన సంగతి విదితమే. ఇళ్లు కోల్పోయిన బాధితులకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన హామీ మేరకు అదే గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ఒక్కొక్కరికి 3 సెంట్ల చొప్పున మంజూరు చేశారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తన కార్యాలయంలో బాధితులకు శనివారం పట్టాలు అందజేశారు. తహసీల్దార్ ఎస్.రాంబాబు, మండల సర్వేయర్ గోవిందరావు, ఆర్ఐ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

దొంగలు ఉంటారు జాగ్రత్త..



ఆటో ద్వారా ప్రచారం చేయిస్తున్న ఎస్ఐ ఎండీ అమీర్ అలీ

కొత్తూరు: సంక్రాంతి పురస్కరించుకుని మార్కెట్, రద్దీ ప్రాంతాల్లో దొంగతనాలపై స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు, ఎస్ఐ ఎండీ అమీర్ అలీ ఆధ్వర్యంలో ఆటో ద్వారా శనివారం కొత్తూరులో ప్రచారం నిర్వహించారు. స్వగ్రామాలకు ఎవరైనా వెళ్తే విలువైన వస్తువులు తీసుకువెళ్లాలన్నారు. వెంట తీసుకువెళ్తున్న బ్యాగ్‌లను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో భద్రపర్చుకోవాలన్నారు. గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో కోడి పందేలు, జూదం, పేకాట ఆడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు.

బతుకు బండి నడపాల్సిందే..!

- తక్కువ పెట్టుబడితో వ్యాపారం
- తెల్లవారితే బతుకు పోరాటం
- మోపెడ్, ఆటోలు, ట్రాలీలు, కావిడితో గ్రామాల్లో విక్రయం
- ఇంటి ముంగిటకే వస్తున్న వ్యాపారులు



ఏబీ రోడ్డుపైన కోళ్ల గూడులు, మానెలు రిక్షాపై అమ్మకానికి తీసుకువెళ్తున్న అమ్మకందారుడు

ఎల్.ఎన్.పేట:

కుటుంబాన్ని పోషించేందుకు తెల్లవారితే ఏదో ఒకపని చేయాల్సిందే. ఒక్కొక్కరు ఒక్కొక్క రకమైన పనిని ఎంచుకుంటారు. అలాంటి వారిలో తెల్లవారితే బతుకు బండిని లాగించేవారు మనకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ ఎక్కువగా కనిపిస్తుంటారు. సంక్రాంతి పండగ సమీపిస్తుండటంతో ఈ వ్యాపారులు మరింత ఎక్కువగా కనిపిస్తున్నారు. సైకిల్, మోటార్ సైకిల్, మూడు చక్రాల ట్రాలీ రిక్షా, ఆటోలు, కావిడిపై మోసుకుంటూ గ్రామాల్లో దర్శనమిస్తున్నారు. పలు రకాల వస్తువులను ఇంటి ముందుకే తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. కొందరు కూరగాయాలు, మరికొందరు ఇంటి అవసరాలకు ఉపయోగపపే సామాన్లు, దుస్తులు, బొమ్మలు, రైతులకు అవసరమయ్యే సామాన్లు.. ఇలా వారి అనుకూలత, వ్యాపార సామర్థ్యం మేరకు గ్రామాల్లోకి తీసుకువచ్చి అమ్ముతుంటారు. వారి వద్ద కొనేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఎక్కువగా ఆసక్తి కనబురుస్తున్నారు. వారు చెప్పిన ధరను పక్కన పెట్టిన బేరం ఆడి నచ్చిన ధరకు కొనుగోలు చేసుకోవచ్చని పలువురు మహిళలు, రైతులు చెబుతున్నారు.

ఊరూరా తిరగాల్సిందే..

నాకు ఉన్న కొద్దిపాటి పొలంలో పండించిన కూరగాయలు, ఆకు కూరలు అమ్ముకునేందుకు ఊరూరా తిరగాల్సి ఉంటుంది. ఒక్కదగ్గర కూర్చుని విక్రయించిన కంటే ఇంటి ముందుకు తీసుకుని వెళ్లే కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపిస్తారు. నా చిన్నప్పటి నుంచి ఇదే వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. కష్టపడి ఊరూరా తిరిగినందుకు కూలి గిట్టుబాటు అవుతోంది.

– బొడ్డాన కైలాస్, వ్యాపారి, పెద్దకోట, ఎల్.ఎన్.పేట





లక్ష్మీనర్సుపేట నుంచి విస్తరాకులను సైకిల్‌పై అమ్మకానికి తీసుకువెళ్తున్న వ్యాపారి



పెద్దకోట నుంచి క్యాబేజీ పువ్వులు గ్రామాల్లో అమ్మకానికి సైకిళ్లపై తీసుకువెళ్తున్న వ్యాపారులు

ఇంటి ముంగిటకే వస్తాయి..



మాకు కావల్సిన అనేక రకాల సామాన్లు కొనుగోలు చేసేందుకు పట్టణ ప్రాంతాలకు, మండల కేంద్రాల్లోని దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి ముంగిటకే తీసుకువస్తున్నారు. తెల్లవారే సరికే ఇంటి ముంగిటకు తీసుకువచ్చిన సామాన్లు పరిశీలించి అవసరం ఉంటే కొనుగోలు చేస్తాం. నచ్చిన ధరకు బేరం ఆడుకోవచ్చు. కొన్ని షాపుల్లోకి వెళితే అక్కడ మాట్లడనివ్వకుండా, మరో బేరం లేకుండా మోసాలు చేస్తుంటారు. వీధి వ్యాపారుల చేతిలో మోసపోయే పరిస్థితి ఉండదు.

– బిడ్డిక ఈశ్వరమ్మ, గృహిణి, జంబాడ, ఎల్.ఎన్.పేట

పార్టీని మరింత పటిష్టం చేద్దాం



పార్టీ పదవులు పొందిన వారిని సత్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్ట పర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గాన్ని పార్టీ కేంద్ర కమిటీ శుక్రవారం ప్రకటించింది. దీంట్లో నరసన్నపేటకు చెందిన ఐదుగురు నాయకులు ఉన్నారు. వారందరికీ శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కృష్ణదాస్ సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల వద్దకు పార్టీ సిద్ధాంతాలను తీసుకువెళ్లాలన్నారు. ప్రస్తుత టీడీపీ పాలనను, గత ప్రభుత్వంలో మనం అమలు చేసిన పథకాల తేడాను ప్రజలకు వివరించాలని, ప్రజలను కూటమి నాయకులు ఎలా వంచిస్తున్నారో తెలియజేయాలన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ ఇచ్చిన పదవులను గౌరవించాలని, పార్టీ ఆదేశాల మేరకు పనిచేయాలన్నారు. నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన పోలాకి మండలం నుంచి చెందిన కరిమి రాజేశ్వరరావును పార్టీ అధికార ప్రతినిధిగా, జలుమూరు మండలానికి చెందిన బగ్గు రామకృష్ణను పార్టీ ఉపాధ్యక్షుడిగా, సెక్రటరీ ఆర్గనైజేషనల్‌గా మొజ్జాడ శ్యామలరావును, నరసన్నపేట పట్టణం నుంచి చీపురు కృష్ణను, సెక్రటరీ యాక్టివిటీలుగా సారవకోట మండలం నుంచి యాళ్ల శ్యామసుందరరావు, నరసన్నపేట మండలం కరగాం నుంచి రావాడ రామారావును పార్టీ నియమించిన విషయం విదితమే. వారందరికీ సత్కరించి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, ముద్దాడ బైరాగినాయుడు పాల్గొన్నారు.

13న గోదాదేవి కల్యాణం

సరుబుజ్జిలి: ఈ నెల13న భోగీ పురస్కరించుకుని పురుషోత్తపురం రంగనాథస్వామి ఆలయంలో గోదారంగనాథ కల్యాణం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకులు సనపల యతిరాజు దాసు శనివారం తెలిపారు. భక్తులు గోదాదేవి కల్యాణంలో పాల్గొన్ని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడే భోగి..

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం పంచాయతీ బడ్డవానిపేటలో ఆదివారం సాయంత్రమే భోగీ పండగ చేసుకుంటారు. గ్రామంలో యువకులు కర్రలను సేకరించి మంటవేస్తారు. పురాతన ఆచారం ప్రకారం ఈ విధంగా అందరిలా కాకుండా ముందురోజు సాయంత్రం మంట వేసి భోగీని స్వాగతిస్తామని సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి తెలిపారు. చాలా ఏళ్లుగా ఇదే ఆనవాయితీ పాటిస్తున్నామన్నారు.

కృతజ్ఞతలు



శిమ్మ సాంబశివరావు

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి పార్టీ నాయకులతో కలిసికట్టుగా పనిచేస్తానని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ పదవి దక్కడంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని మరింత పెంచుకుంటానని సాంబశివరావు తెలిపారు.

అనాథలకు అండగా రెడ్‌క్రాస్



మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

నరసన్నపేట: జిల్లాలోని పలువురు అనాథలకు రెడ్‌క్రాస్ సంస్థ అండగా ఉంటోందని సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక వీరన్నాయుడు కాలనీలో లెప్రసీ హౌస్‌లో ఉన్న రోగులకు సంక్రాంతి సందర్భంగా నిత్యావసర సరుకులు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. 25 మందికి నిత్యావసర సరుకులు, గిన్నెలు, దోమ తెరలు అందించారు. లెప్రసీ హౌస్ ప్రతినిధి వెంకటేశ్వరరావు, బ్రైట్ ఫ్యూచర్ సొసైటీ మేనేజర్ ఎస్.ఎల్.ఒ.ఎలీసా, డీసీఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై నిఘా



సీఐ రామరావు, పాతపట్నం

పాతపట్నం: సంక్రాంతి నేపథ్యంలో అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా వేసినట్లు పాతపట్నం సీఐ వి.రామారావు తెలిపారు. కోళ్లు, పొట్టేళ్ల పందేలు, జూద శిబిరాలను పూర్తిగా నిషేధించినట్లు వివరించారు. సర్కిల్ కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. సారా అమ్మకాలు, తయారీ, రవాణా చేసినా సహించేది లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపుల నిర్వహించినా కేసులు నమోదు చేస్తామన్నారు. యువత, ఆటో డ్రైవర్లు కచ్చితంగా వాహన నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి, మితిమీరిన వేగం, అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించడం వంటివి చేయకూడదన్నారు. గతంలో జూద శిబిరాలపై నిఘా వేసి బైండవర్ కేసులు నమోదు చేశామన్నారు. పాతపట్నం పోలీస్ సర్కిల్ పరిధిలో పాతపట్నం, మెళియాపుట్టి స్టేషన్లలో పండగ నేపథ్యంలో రాత్రిపూట పలు చోట్ల గస్తీ ఏర్పాటు చేశామన్నారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో ఉన్న రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనుమానితులు సంచరిస్తే 100కు, సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. సంప్రదాయ పండగను అన్నివార్గాల ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించవద్దని సీఐ హితవు పలికారు.

13 నుంచి లచ్చమ్మ పేరంటాల జాతర



సాకల లచ్చమ్మ పేరంటాల గుడి

బూర్జ: ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మండల కేంద్రంలోని సాకల లచ్చమ్మ పేరంటాల జాతర నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రధాన అర్చకురాలు గుడ్ల నవనీతం శనివారం తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ సందర్భంగా జాతర నిర్వహిస్తామన్నారు. 1965లో గుడి నిర్మాణం చేపట్టిన నాటి నుంచి ప్రతిఏటా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. బూర్జతోపాటు చుట్టు పక్కల మండలాల ప్రజలు వచ్చి దర్శనాలు, పూజలు, మొక్కులు తీర్చుకుంటారన్నారు.

వివేకానందుడు ఆదర్శప్రాయుడు



మాట్లాడుతున్న పెంటా అటకేశం

నరసన్నపేట: దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని, యువతీయువకులు వివేకానందుడి జీవిత చరిత్రను చదివి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సామాజిక సమరసత వేదిక ఉత్తరాంధ్ర ప్రతినిధి పెంట అటకేశం అన్నారు. ఉర్లాంలో శనివారం వివేకానందుడి జయంతి వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, సామాజిక సమరసత స్థానిక ప్రతినిధి బార్ల వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ వివేకానందుడి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.లత, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న చంద్రశేఖరరాజు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలను బంగారు సంతోషి సంస్థల సభ్యుడు వైశ్యరాజు చంద్రశేఖరరాజు (పొట్టిరాజు) శనివారం ప్రారంభించారు. అనేక ప్రాంతాల నుంచి సంక్రాంతి పండగకు గ్రామాలకు వచ్చిన యువత క్రికెట్ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. యువత చదువు, క్రీడల్లో పోటీతత్వం పెంచుకోవటం వల్ల అనేక విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ కిట్‌ను అందజేశారు.

కబడ్డీ విజేత గొల్లమామిడిపల్లి



కబడ్డీ విజేతలకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న చింతాడ రవికుమార్

- ముగిసిన జగనన్న సంక్రాంతి సంబరాలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న రవికుమార్, నాయకులు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి రావికంటిపేటలో రెండు రోజులుగా వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సంక్రాంతి సంబరాలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. కబడ్డీ పోటీల్లో 23 జట్లు తలపడ్డాయి. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యుడు, రిఫరీ బోర్డు చైర్మన్ తిరుపతిరావు, కబడ్డీ బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు సమక్షంలో నాకౌట్ మ్యాచ్‌లు నిర్వహించారు. కబడ్డీ విన్నర్‌గా గొల్లమామిడిపల్లి, రన్నర్‌గా సింగుపురం నిలిచాయి. మూడు, నాలుగు స్థానాలను కొర్లకోట, పాలకొండ సొంతం చేసుకున్నాయి. కబడ్డీ విన్నర్స్‌కు రూ.50వేలు, రన్నర్స్‌కు రూ.30వేలు, మూడో స్థానానికి రూ. 20 వేలు, నాల్గో స్థానానికి రూ.20 వేలు నగదు బహుమతి, జ్ఞాపికలను చింతాడ రవికుమార్, నాయకులు అందజేశారు.

రంగవల్లుల పోటీ విజేత రూ.10వేలు నగదు..

రంగవల్లుల పోటీల్లో ప్రథమ స్థానం పొందిన టి.సుధారాణి–టీమ్(రావికంటిపేట)కి రూ. 10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన బి.గౌతమి–టీమ్ (రావికంటిపేట)కు రూ.5 వేలు, తృతీయ స్థానం పొందిన మహేశ్వరి టీమ్ (వంజంగి)కు రూ.2వేల నగదు బహుమతులను రవికుమార్ అందజేశారు. ఈ కార్యాక్రమంలో పార్టీ బూర్జ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, పార్టీ ముఖ్య నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మామిడి రమేష్, చింతాడ సత్యప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఒలింపిక్ అసోసియేషన్, కబడ్డీ అసోషియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులకు, పార్టీ శ్రేణులకు చింతాడ రవికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా బొడ్డేపల్లి రమేష్‌కుమార్ పుట్టినరోజు



కేక్ కట్ చేస్తున్న రమేష్‌కుమార్, చిత్రంలో చింతాడ రవికుమార్

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్ పుట్టినరోజు వేడుక ఆమదాలవలస పట్టణంలోని ఆయన గృహంలో కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణుల మధ్య శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. మెట్టక్కివలస ప్రాంతంలో పలువురు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ నాయకులు దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి అజంతకుమారి, సాధు చిరంజీవి, మామిడి రమేష్, బొడ్డేపల్లి రాజు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి



అప్పలరాజు మృతదేహం

ఎల్.ఎన్.పేట: మండలంలోని గ్రామం ఇందిరానగర్ కాలనీకి చెందిన బోసు అప్పలరాజు (53) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. టెక్కలి ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్నారు. శనివారం విధులకు వెళ్లేందుకు ఉదయం సిద్ధమవుతున్న సమయంలో గుండె నొప్పిగా ఉందని, వంట్లో నలతగా ఉందని మంచంపైన కూర్చున్నాడు. వెంటనే గుండె పోటుకు గురైన మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న టెక్కలి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ బి.ఎస్.ఎన్.మూర్తి, అసోసియేషన్ సభ్యులు అప్పలరాజు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తక్షణ సహాయంగా రూ.15వేల నగదు అందజేశారు. మృతునికి తల్లి చెంచమ్మ, భార్య రాణి, కుమార్తె మేరీ, కుమారుడు ఆకాష్ ఉన్నారు.

కుండలకు గిరాకీ..



ఈ చిత్రం కొత్తూరు మార్కెట్‌లో విక్రయిస్తున్న మట్టి కుండలు. సంక్రాంతికి కొత్త మట్టి కుండల్లో వంటలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. మరో రెండు రోజుల్లో సంక్రాంతి ఉన్నందున కుండలను విక్రయించేందుకు కుమ్మర్లు తీసుకువచ్చారు. కొత్తూరుతో పాటు సమీప గ్రామాల ప్రజలు వచ్చి కుండలను కొనుగోలు చేయడంతో డిమాండ్ పెరిగింది. – కొత్తూరు

భోగీ సందడి..



సారవకోట మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల ఆవరణలో శనివారం పిడకలతో భోగీ మంట ఏర్పాటు చేశారు. విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తయారుచేసిన పిడకలను మంటలో వేశారు. పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగీ మంట ఏర్పాటు చేశామని డైరెక్టర్ మోహనగాంధీ తెలిపారు. – సారవకోట